ఆంధ్రజ్యోతి

**

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

శనివారం 10 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	202	229
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 21.2

ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో, కేంద్ర ప్రభుత్వం సైతం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. దానికనుగుణంగా రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ జిల్లాలో దశాబ్దాలుగా నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి, చిరకాల కోరికలుగా ఉన్న ప్రాజెక్టుల పూర్తికి నిధులు, రోడ్లు, ఆస్పత్రుల ఆధునికీకరణ, సాగునీటి పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో స్థానం దక్కుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)




- ఎన్నికల హామీలకు బడ్జెట్లో నిధులిస్తారని ఆశాభావం
- విద్యాసంస్థల ఏర్పాటు, వైద్య సదుపాయాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందనే చర్చ
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చేనా?

'భట్టి' బడ్జెట్‌పై బోలెడు ఆశలు

విద్యా సంస్థల ఏర్పాటుపై ఆశలు

జిల్లాలో ఉన్నత విద్యావకాశాలను పెంచేలా, పేద, మధ్యతరగతివర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చేలా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంతా భావిస్తున్నారు. ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఉపాధి కల్పించే కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ సైతం ఉమ్మడిజిల్లాకు దక్కనుంది. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ పీజీ కళాశాల, నార్కట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడలో మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలు, చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు, కోదాడలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం లభిస్తుందని ఆయా ప్రాంత వాసులు ఆశిస్తున్నారు. హాలియాలో ఇప్పటికే ఉన్న డిగ్రీకళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులిస్తారని భావిస్తున్నారు.



మెరుగైన వైద్యసేవలకు కేటాయింపులు ఉండేనా?



ఉమ్మడి జిల్లాలో వైద్యసేవలను క్రమబద్ధీకరించడంతో పాటు, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన కార్యాచరణను ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంతా ఆశిస్తున్నారు. ప్రధానంగా ప్రతీ మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏరియా ఆస్పత్రిని ఏర్పాటుచేయాలనే డిమాండ్లకు ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం లభిస్తాయని భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడేషన్‌కు అనుమతి ఇస్తారని, మోత్కూరులో పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్, మునుగోడు పీహెచ్‌సీని 30పడకల ఆస్పత్రిగా మార్చాలనే డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. ఆలేరులో 30పడకల ఆసుపత్రిని 100 పడకలకు మార్చాలని, హాలియాలో 30పడకల ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకాలతో పాటు, మందులు, ఇతర మౌలికవసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరుతా..

దేవరకొండ నియోజకవర్గంలోని డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఇప్పటికే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. ప్రాజెక్టులతోపాటు తాగునీటి అవసరాలకు, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తా.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

నిధులు కేటాయిస్తేనే పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వాడపల్లి శ్రీలక్ష్మీనరసింహ, మీనాక్షి ఆగస్తేశ్వర ఆలయాలతో పాటు, దేవరకొండ, దేవరచర్ల, పిల్లలమర్రి, మేళ్లచెర్వు స్వయంభు శంభులింగేశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దేవరకొండ ఖిల్లాకు పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. చౌటుప్పల్ మండలంలోని రాచకొండను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటుచేయాలనే డిమాండ్లు ఉన్నాయి. భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం నిధులు కేటాయించగా, పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే దీనికి తోడ్పాటుగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

కొత్త మండలాల్లో సౌకర్యాల కోసం ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన కొత్త మండలాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రధానంగా మండల కార్యాలయాలకు నూతన భవనాలు, ఇతర వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తారని ఆయా మండల వాసులు భావిస్తున్నారు. మిర్యాలగూడ మునిసిపాలిటీలో దశాబ్దకాలంగా అసంపూర్తిగా నిలిచిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పూర్తికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, హాలియా మునిసిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. వీటితోపాటు పలు మౌలిక వసతుల కల్పనపై బడ్జెట్‌లో నిధులు ఉంటాయని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలుగా ఊరిస్తున్న పలు సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కృష్ణానది నికర జలాల కేటాయింపులున్న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తికి భారీగా నిధులు ఉంటాయని అనుకుంటున్నారు. సొరంగమార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 3.50లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు తప్పుతాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పెండ్లిపాకల ప్రాజెక్టు, మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికి పూర్తిస్థాయిలో నిధులు అవసరం. నకిరేకల్ నియోజకవర్గంలో బి.వెల్లంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకానికి రూ.400కోట్లు, కట్టంగూరు మండలంలో అయిటిపాముల రిజర్వాయర్ పూర్తికి రూ.100కోట్లు మంజూరు కావాల్సి ఉంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కేశవాపురం, వాడపల్లి-బొత్తలపాలెం, దున్నపోతులగండి, వీర్లపాలెం తోపుచర్ల ఎత్తిపోతల పథకాల పూర్తికి నిధులు కేటాయించాల్సి ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో బునాదిగానికాల్వ పూర్తిచేసి మోత్కూరు, అడ్డగూడూరుకు సాగునీటి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే సామేల్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. చౌటుప్పల్ మండలంలో పిల్లాయిపల్లి కాల్వ పూర్తికి, చండూరు మండలం బెండలమ్మచెరువు నిర్మాణానికి, శేషులేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్ ఛానల్ నిర్మాణాలకు నిధులివ్వాలని కోరుతున్నారు. కనగల్ మండలంలో ఏఎమ్మార్పీ కాల్వ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేయాలనే ప్రధాన డిమాండ్ ఉంది. పొనుగోడు చెరువుకు నీటి సరఫరా చేసేందుకు కాల్వ నిర్మించాల్సి ఉంది. పిల్లాయిపల్లి కాల్వ నిర్మించి రేగట్టెకు నీటి తరలింపు, పగిడిమర్రి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులిస్తారని ఆశిస్తున్నారు. హాలియా మండలంలో పేరూరు మేజర్ ఆధునికీకరణ పనులు, తిరుమలగిరి (సాగర్) మండలంలోని నెల్లికల్లు లిఫ్టు పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఈ బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు, నిర్వాసితులకు అవసరమైన పరిహారాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయించాలనే డిమాండ్ ప్రధానంగా ఉంది. సూర్యాపేట నియోజకవర్గంలో కీలకమైన శ్రీరాంసాగర్ రెండోదశ చివరి భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునికీకరణ, పనుల పూర్తికి నిధులివ్వాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

● అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం

ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట రూరల్: ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, యాదగిరిగుట్టలో ఆటో కార్మికులను ఆదుకోవాలని ప్రస్తావించగా, ఆయన మాటలకు అడ్డుతగులుతూ ప్రభుత్వ విప్ అయిలయ్య స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి ఆలయాన్ని రూ.1,200 కోట్లతో పునర్నిర్మాణం చేశారని, అయినా స్వామి వారిని దర్శించుకొనే భక్తులు, ఆటో కార్మికులు, భూములు కోల్పోయిన వారి బాధలు చూస్తే ప్రతీ ఒక్కరికి అర్థమవుతుందన్నారు. అభివృద్ధి పేరుతో 500 కుటుంబాలను ఇబ్బందులకు గురిచేశారని, 300మంది కార్మికుల ఆటోలను కొండపైకి వెళ్లకుండా రద్దుచేసి వారి పొట్టలు కొట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు చొరవతో ఆటోలను తిరిగి కొండపైకి అనుమతించారని, ఈ నెలలో దీన్ని ప్రారంభిస్తామన్నారు. భక్తులకు వసతి కల్పించేందుకు డార్మెటరీ హాల్ నిర్మాణం అవుతోందని ఆయన వివరించారు. వైటీడీఏ పేరుతో కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి 50శాతం నిధులు దోచుకున్నారని ఆరోపించారు. యాదాద్రి ఆలయంలో అర్చకులకు కనీస సౌకర్యాలు లేవని, ఇలాంటి పనులు చేసిన గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మొసలికన్నీరు కార్చడం హాస్యాస్పదమన్నారు.

పదేళ్ల పాలనలో మూసీ మురికి నీరే గతి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నకిరేకల్ నియోజకవర్గంలో కనీసం ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదని, సాగు నీటి ప్రాజెక్టులకు నోచుకోని నియోజకవర్గంలో మూసీ మురికి నీరే తప్ప కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటి చుక్క ఇవ్వలేకపోయారని ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీలో ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ప్రారంభోపన్యాసం చేసిన ఆయన ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇదివరకు బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, అక్కడ అవమానించినందునే తనను ఆదరించిన కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులు తనకు తెలునని, తనను అనవసరంగా కెలకవద్దని, తనతో కెలికించుకోవద్దని హెచ్చరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఏ ప్రాజెక్టును బీఆర్ఎస్ పూర్తి చేయలేదన్నారు.

మిషన్ భగీరథ ద్వారా తన నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా కాకపోగా, ప్రత్యామ్నాయ నీటి పథకాలకు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో వార్డులో ఉన్న కుళాయిల ద్వారానే సరిపడా నీళ్లందాయన్నారు. ఒక్క గురుకుల పాఠశాలకు కూడా సొంత భవనం నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంతో నియంత పాలనకు తెరపడి, స్వచ్ఛ తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి ఓపికతో ఉండాలన్నారు. ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశా సందర్భంగా గవర్నర్ తీర్మానానికి ధన్యవాదాలు తెలుపుతూ అధికార పక్షం నుంచి ప్రసంగించే అవకాశం వీరేశానికి దక్కింది. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అట్టహాసంగా ఖోఖో పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి 56వ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు యాదాద్రి జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను డీఈవో నారాయణరెడ్డి ప్రారంభించగా, తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. తొలిరోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో హోరాహోరీగా సాగుతున్న పోటీలను తిలకించేందుకు స్థానికులు, క్రీడాభిమానులు ఆసక్తి చూపించారు.

●7లో..

రోడ్డు భద్రత అందరి బాధ్యత:ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 9 : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో 35వ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు కారకులైతే పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. అలసత్వం, నిర్లక్షంతో ప్రమాదాలకు బాధ్యులు కావద్దన్నారు. మీ కుటుంబంతో పాటు ఇతర కుటుంబాలను రోడ్డున పడేయవద్దని సూచించారు. జీవితం చాలా విలువైందని, రోడ్డు భద్రత చాలా ముఖ్యమన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నిబంధనల మేరకు హెల్మెట్, ఫిట్‌నెస్, లైఫ్‌టాక్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్రగాయాలై చనిపోయిన సంఘటనలు అధికంగా ఉన్నాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఆటోడ్రైవర్లకు ఆటో స్టాండ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం రోడ్డు ప్రమాదాలపై ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనా, డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్, పోలీసులు, ఆటోడ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

సూర్యాపేటక్రైం: విధుల నిర్వహణలో క్రమశిక్షణ ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డులకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 187మంది హోంగార్డులకు సీనియారిటీ ప్రకారం బదిలీలు చేశామన్నారు. సిబ్బంది పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందజేయాలన్నారు. హోంగార్డులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ఏ చిన్న సమస్య వచ్చినా పైఅధికారులకు తెలియజేయాలన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం పోలీస్‌శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐ నారాయణరాజు, హోంగార్డుల ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయండి

కలెక్టర్ వెంకట్రావ్



సింగారెడ్డిపాలెం గ్రామంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పెన్‌పహాడ్, నేరేడుచర్ల, గరిడేపల్లి, ఫిబ్రవరి 9: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో సేకరిస్తున్న వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ పరిశీలించారు. గ్యాస్ వినియోగదారుల ఇంటి వద్దకు వెళ్లి యాప్‌లో డేటా నమోదు ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను, పెంట దిబ్బలను, చెత్తాచెదారాన్ని తొలగించి, రోడ్లన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మాణం చేసుకోవాలన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా గట్టిమట్టి పోయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటాచారి, ఎంపీవో నరేష్, ఆర్ఐ స్వప్న, కార్యదర్శి షేక్ అఖిల్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో, గరిడేపల్లి మండల కేంద్రంలో సర్వే ప్రక్రియను కలెక్టర్ వెంకట్రావ్ పరిశీలించారు. యాప్‌లో తప్పులు దొర్లకుండా గ్యాస్ వినియోగదారుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గరిడేపల్లిలో 581 దరఖాస్తులు మిస్ మ్యాచింగ్‌గా ఉన్నాయని రెండు రోజుల్లో వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సైదులు, బండ కవిత, ఎంపీడీవో శంకరయ్య, వనజ, పంచాయతీ కార్యదర్శి రమేష్, సురేష్, సరిత, ప్రత్యేకాధికారి రాజేశ్వరి, ఏఎన్ఎం మమత, గరిడేపల్లి ఎంపీపీ పెండెం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అదనపు ఎస్పీ నాగేశ్వరరావు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మేకా నాగేశ్వరరావు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు ఎస్పీ మేకా నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం పట్టణంలో లారీడ్రైవర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, వాటిని నివారించేందుకు నిబంధనలు పాటించాలన్నారు. రాత్రి సమయాల్లో ఎక్కుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగమే అన్నింటికీ అనర్థమన్నారు. రోడ్ల పక్కన వాహనాలు నిలపవద్దని సూచించారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తూ విలువైన జీవితాన్ని కోల్పోవద్దన్నారు. ఒక వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబమంతా ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ఆటోడ్రైవర్లు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ ముత్తయ్య, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కరుణించు.. నారసింహా!



వైకుంఠ గాలిగోపురం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్ బ్రిడ్జి

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం స్థానిక వ్యాపారుల జీవితాలను చిన్నాభిన్నం చేసింది.. దశాబ్దాలుగా కొండమీద, కొండకింద వ్యాపారు లు నిర్వహిస్తున్న వారు ఆలయ విస్తరణలో సర్వం కోల్పోయారు. స్థానిక వైకుంఠద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు నిర్మించిన అండర్‌పాస్ రహదారి అక్కడి వ్యాపారులను కోలుకోలేకుండా చేసింది. భక్తులు వచ్చే మార్గం లేకుండాపోవడం, బస్‌టెర్మినల్ నుంచి నేరుగా బస్సుల రాకపోకలు కొనసాగుతుండటంతో వ్యాపారాలు మందగించాయి. దీనికి తోడు గండిచెరువు పనుల్లో మందగమనం, మొదటిఘాట్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్, పారిశుధ్యం లోపం భక్తులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో కరుణించు నారసింహా అంటూ వ్యాపారులు, భక్తులు వేడుకుంటున్నారు.

●7లో..

'మహాలక్ష్మి' పథకం దరఖాస్తులు త్వరగా ఆన్‌లైన్ చేయాలి



దరఖాస్తుల పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

తిరుమలగిరి, ఫిబ్రవరి 9 : మహాలక్ష్మి పథకం దరఖాస్తులు త్వరగా ఆన్‌లైన్ చేయాలని అదనపు కలెక్టర్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో సబ్సిడీ గ్యాస్ కనెక్షన్ కోసం డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని తనిఖీచేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీఇంటికి వెళ్లి ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ దండు శ్రీను,మేనేజర్ బుచ్చిబాబు,ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జవహర్ నవోదయ పరీక్ష

భానుపురి, ఫిబ్రవరి 9: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి 1.30గంటలవరకు ఈ పరీక్ష ఉంటుందని, జిల్లాలోని 1,934 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. అందుకు జిల్లా కేంద్రంలో ఏపీఎం బాలికల పాఠశాల, ఇమాంపేట మోడల్ స్కూల్, ప్రభుత్వ నెంబర్-2 పాఠశాల, జడ్పీహెచ్ఎస్(బాలుర), సిటీ ట్యాలెంట్ పాఠశాల, ఎంఏఎం, సిద్దార్థ ఉన్నత పాఠశాల, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పీవీ ఆలోచనల ప్రతిరూపం

సర్వేల్ గురుకులం

- దేశంలోనే మొట్టమొదటి గురుకులం
- 1971లో సీఎం హోదాలో ప్రారంభించిన పీవీ
- పీవీ.నర్సింహారావుకు భారతరత్నను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

●7లో..

స్వాతంత్ర్య సమరయోధుడు

చినవెంకట్‌రెడ్డి మృతి

- 102ఏళ్ల పరిపూర్ణ జీవనం

నమ్మించి..మేనబావతో విషం కలిపించి హత్య

డిండి, ఫిబ్రవరి 9 : పథకం ప్రకారం మేనబావతో కల్లులో విషం కలిపించి ఓ వ్యక్తిని హత్య చేసిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ సీఐ సురేష్, ఎస్ఐ సైదులుతో కలిసి దేవరకొండలో కేసు వివరాలు వెల్లడించారు. వీరబోయినపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు, అతడి చిన్నాన్న నంది ఈశ్వరయ్యకు మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. ఏవిధంగానైనా నంది సహదేవుడిని అంతమొందించాలని భావిస్తున్న ఈశ్వరయ్య నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం వెలమలపల్లి గ్రామానికి చెందిన సహదేవుడి మేన బావ జంగయ్యను సంప్రదించాడు. నాటుసారాలో విషం కలిపి సహదేవుడిని చంపేందుకు పథకం రూపొందించారు. ఈ నెల 6న నాటుసారాలో విషం కలిపి సహదేవుడి వ్యవసాయ పొలంలో సమాధుల వద్ద ఉంచి తీసుకొమ్మని



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

సహదేవుడికి ఫోన్ చేశాడు. సహదేవుడు, అతడి కుమారుడు రాము అదే రోజు సాయంత్రం నాటుసారా తెచ్చుకొని తాగారు. కొద్దిసేపటికే సహదేవుడికి వాంతులు, విరోచనాలు కావడంతో అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సహదేవుడి కుమారుడు రాము హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు విచారణ జరిపి నాటుసారాలో విషం కలిపిన నంది ఈశ్వరయ్య, జంగయ్యలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్య

మునగాల, ఫిబ్రవరి 9: అప్పుల బాధతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా మునగాల ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ముస్కుల వీరశేఖర్(40) నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. అయితే చిట్‌ఫండ్‌లో పెట్టుబడి పెట్టి అప్పులఊబిలో కూరుకుపోయాడు. అప్పులు తీరే మార్గం లేక మనస్థాపం చెంది మూడు రోజుల కిందట క్రిమిసంహారక తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో పునర్నిర్మాణ పనులతో వ్యాపారు లు వీధినపడ్డారు. యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠద్వారం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్‌తో వ్యాపారాలు ఏ మాత్రం సాగక తమ బతుకులు ఆగమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి.. మమ్ము రక్షింపరావేమి అంటూ వేడుకుంటున్నారు. ఇక గిరిప్రదక్షిణ రహదారి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది, గండిచెరువు అభివృద్ధి పనులు కొనసాగుతాయా అన్న అనుమానాలు స్థానికులు లేవనెత్తుతున్నారు. మొదటి ఘాట్‌రోడ్ ఉండగా మరో ఫ్లైఓవర్ నిర్మాణం అవసరమా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటం, గుట్టలుగా పేరుకుపోయిన దుర్గంధం వెదజల్లుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● యాదగిరిగుట్ట

కరుణించు నారసింహా!

యాదగిరీశా శరణు 6



మొదటి ఘాట్‌రోడ్డుకు అనుసంధానంగా నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్

ఆలయ విస్తరణలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించాలని వైటీడీఏ నిర్ణయించింది. ఈ క్రమంలో కొండకింద వైకుంఠ గాలిగోపురం నుంచి సన్నిధి హోటల్ వరకు విస్తరణకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసి ముసాయిదా ప్రణాళికలను రూపొందించారు. సుమారు రూ.13 కోట్లతో విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠ గాలిగోపురం వరకు రహదారిపై వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించారు. సుమారు 300 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మించిన అండర్ పాస్ స్థానికుల పాలిటశాపంగా మారింది.

అంతకుముందు

ఆలయ పునర్నిర్మాణానికి ముందు కొండపైన స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు కొండకింద తులసికాటేజ్, స్వామివారి గోశాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుటుంబసభ్యులతో బస చేసేవారు. ఈ క్రమంలో కొండకింద ప్రధాన రహదానికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాలకు వెళ్లి పసుపు, కుంకుమ, స్వామివారి ఫొటోలు, మిఠాయిలు, తమ పిల్లలకు కావాల్సిన ఆటబొమ్మలు తదితరాలను కొనుగోలు చేసేవారు. దీంతో కొండపైనే కాకుండా కొండకింద పట్టణ ప్రధాన వీధులు సైతం కోలాహలంగా కనిపించేవి. వైకుంఠ గాలిగోపురం నుంచి కొండపైకి వెళ్లే మెట్లదారిలో స్థానికులు ఏర్పాటుచేసుకున్న దుకాణాల్లో నడక దారి భక్తులు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేవారు. అదేవిధంగా రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాల్లోనే పట్టణ ప్రజలు సైతం సరుకులు కొనుగోలు చేసేవారు. ఇలా స్థానిక వ్యాపారుల వ్యాపారం సజావుగా సాగేది.

అండర్‌పాస్‌తో వ్యాపారుల బతుకులు ఆగం

అండర్‌పాస్ నిర్మాణంతో ఒక్కసారిగా వ్యాపారస్తుల జీవితాలు అగాధంలోకి తోసినట్లయ్యింది. ఓ వైపు రహదారి విస్తరణకు భూములు కోల్పోయారు. దీనికి తోడు రహదారి విస్తరణ పనులతో స్థానికులు కూడా అటుగా వచ్చిన కొనుగోలు చేయడం తగ్గించారు. ఇక యాత్రీకుల సంగతి సరేసరి. అండర్‌పాస్ పైనుంచే నేరుగా బస్టాండ్ వద్దకు వెళ్తుండటంతో దుకాణాల వైపు వచ్చే వారు లేరు. దీంతో వ్యాపారులు పూర్తిగా మందగించి కుటుంబాలు వీధిన పడ్డాయి.

కొత్త బస్టాండ్లతో వ్యాపారుల ఇబ్బందులు

యాదాద్రి ఆలయ విస్తరణలో భాగంగా గండిచెరువు సమీపంలో ఆర్టీసీ బస్టాండ్, టెంపుల్ బస్‌టెర్మినల్‌ను నిర్మించడంతో ప్రస్తుతం పాత జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బస్టాండ్ సమీపంలోని వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్సులన్నీ ఇక్కడే నిలుస్తుండడంతో బస్టాండ్ సమీపంలోని దుకాణాలు ఎప్పుడూ రద్దీగా ఉంటూ వ్యాపారాలు బాగా జరిగేవి. ఇప్పుడు కొత్త బస్టాండ్ నిర్మించాక నేరుగా భక్తులు అక్కడికి చేరుకుని, కొండపైకి వెళ్తున్నారు. దీంతో ఎన్నాళ్ల నుంచో దుకాణాలు నడుపుతున్న వ్యాపారస్తులు వ్యాపారంజరగక తీసుకున్న రుణాలు,వాటికి మిత్తీలు లోన్‌లు, కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.



గండిచెరువు వద్ద అసంపూర్తిగా మెట్ల నిర్మాణం

సాగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పనులు

పంచనారసింహుడు కొలువుదీరిన కొండచుట్టూ సుమారు 2.6కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ రహదారి పనులు సాగుతూనే ఉన్నాయి. రూ.3.2 కోట్లతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. కాగా ఇప్పటివరకు 1.8 కిలోమీటర్ల రహదారి దాదాపు పూర్తి కాగా మిగిలిన 0.8కిలో మీటర్ల మేరకు రహదారి పనులు జరగాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తర్వాత గిరిప్రదక్షిణ రహదారి చుట్టూ ఫెన్సింగ్, రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గిరిప్రదక్షిణ రహదారి పనులకు నిధుల లేమి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

గండిచెరువు అభివృద్ధి సాగేనా?

యాదగిరికొండ దిగువన మల్లాపూర్ వెళ్లే రహదారిలోని గండిచెరువును రూ.33కోట్ల అంచనా వ్యయంతో మినీ ట్యాంక్‌బండ్ తరహాలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగేనా అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన గండిచెరువు విస్తరణ పనులకు నిధుల గండం నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు రూ.22కోట్లతో పనులు జరగ్గా, మిగిలిన పనులకు రూ.11కోట్ల నిధులు సరిపోవని, ఇక మంజూరైన నిధులతో పనులు చేపడదామన్నా నిధులు మంజూరయ్యేనా అన్న అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. గండిచెరువు ముందున్న గుట్టపై లేజర్ షోకు ఏర్పాట్లు, ధ్యాన, ప్రవచన మండపాలతో పాటు పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

మొదటి ఘాట్‌రోడ్ ఉండగా వంతెన అవసరమా?

యాదగిరిక్షేత్రంలో తులసికాటేజ్ ప్రాంతం నుంచి మొదటి ఘాట్‌రోడ్‌ను అనుసంధానం చేస్తూ వైటీడీఏ సుమారు రూ.33కోట్లతో 480 మీటర్ల పొడవు, 25అడుగుల వెడల్పుతో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తోంది. ఈ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. అయితే దశాబ్దాల కిందట నిజాం రాజుల పాలనలో కొండపైకి రవాణ సౌకర్యాల కోసం మొదటి ఘాట్‌రోడ్ నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే ఆలయ విస్తరణ పనుల వాహనాలు, భక్తుల వాహనాల రద్దీ కారణంగా మొదటి ఘాట్‌రోడ్ దెబ్బతినడంతో ఉద్ఘాటనకు ముందు ఈ ఘాట్‌రోడ్‌ను 36అడుగల వెడల్పుతో పునర్నిర్మించారు. మొదటి ఘాట్‌రోడ్ నిర్మాణం ఉండగా దానిని అనుసంధానం చేస్తూ మరో ఫ్లైఓవర్ నిర్మించడం ఎందుకని, ఈ ఫ్లైఓవర్ ఏమాత్రం అవసరం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఆలయ విస్తరణ కన్నా ముందు రెడ్ల సత్రం సమీపం నుంచి కొండపైకి నిర్మించిన రెండవ ఘాట్‌రోడ్ నేటికి వాహనా రాకపోకలకు అనుతిలేక పోవడంతో వినియోగం లేక వృథాగా ఉంటోంది.

గుట్టలో పడకేసిన పారిశుధ్యం

గుట్ట ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండపైన బస్‌బే, ప్రధానకార్యాలయం సెల్లార్, కొండకింద నిత్యాన్న వితరణ సత్రం, వ్రత మండపం, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. కొండపై వరకు పందులు, కుక్కలు సంచరిస్తూ వీరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.

నిరుపయోగంగా ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లు

యాదగిరిగుట్ట ఆలయ విస్తరణలో భాగంగా కొండకు దక్షిణదిశలో ల్యాండ్ స్కేపింగ్ గార్డెన్‌లను వైటీడీఏ అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. అయితే ఈ గార్డెలను భక్తులు చేరుకునే అవకాశం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇదిలాఉంటే గార్డెన్ల నిర్వహణ కోసం సైతం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుండటం గమనార్హం.



నిరుపయోగంగా రెండో ఘాట్‌రోడ్డు

వార్షిక బ్రహ్మోత్సవాలకు
సిద్ధమవుతున్న పాతగుట్ట

● 15 నుంచి అధ్యయనోత్సవాలు ● 19 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు



పాతగుట్ట ఆలయ ప్రధాన ముఖద్వారం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన పూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింస్వామి సన్నిధి వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పాంచాహ్నిక దీక్షలో పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, వీవీఐపీలకు, వివిధ శాఖల అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపిస్తున్నారు. పాతగుట్ట ప్రధానాలయంలో యాగశాల నిర్మాణం, అలంకార సేవల కోసం వాహన సేవలను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు. పాతగుట్ట కొండపైన పుష్కరిణి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ఉత్సవాలకు ముస్తాబు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

బ్రహ్మోత్సవ ఘట్టాలు ఇలా..

- ఈ నెల 19వ తేదీ సోమవారం ఉదయం స్వస్తివాచన పూజలతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. సాయంత్రం అంకురారోపణ, మృత్సంగ్రహణం పూజలు.
- 20న ఉదయం ధ్వజారోహణం. సాయంత్రం దేవతాహ్వానం, భేరీపూజ, హవనం.
- 21న ఉదయం సింహవాహన అలంకార సేవ, రాత్రికి ఎదుర్కోలు మహోత్సవం.
- 22న ఉదయం హవనపూజలు, రాత్రి వేళ తిరుకల్యాణోత్సవం.
- 23వ తేదీ ఉదయం నిత్య పూజలు, రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం.
- 24న ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి,విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం, సాయంత్రం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం.
- 25న ఉదయం శతఘటాభిషేకం..పండిత సన్మానం..బ్రహ్మోత్సవ పరిసమాప్తి.

పాతగుట్ట ఆలయంలో నిత్యకల్యాణాలు రద్దు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో నిత్య, శాశ్వత కల్యాణాలను రద్దు చేశారు. ఈ నెల 23వ తేదీన స్వామివారి దివ్యవిమాన రథోత్సవం కారణంగా అర్చనలు, అష్టోత్తరశతానామార్చనలు, భోగాలు, 24వ తేదీన చక్రతీర్థం, 25వ తేదీన స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో అభిషేకాలు అర్చనలు నిలిపివేస్తారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవ పర్వాలు నేత్రపర్వంగా సాగాయి. సుప్రభాతంతో నిత్యపూజలు ఆరంభించిన ఆచార్యులు గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. స్వయంభువులను వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలు, కుంకుమలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్యార్చనలు, చండీ హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. ఆండాళ్ అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసులు మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,09,975ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు చినవెంకట్‌రెడ్డి మృతి



కేతేపల్లి, ఫిబ్రవరి 9: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్ర మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు కొత్తపేట గ్రామానికి చెందిన బుర్రి చినవెంకట్‌రెడ్డి(102) గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చినవెంకట్‌రెడ్డి 1971-83 వరకు ఉమ్మడి కేతేపల్లి గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన స్వగ్రామం కొత్తపేట కాగా పాతికేళ్లుగా హైదరాబాద్‌లో కుమారుల వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకట్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీవీ ఆలోచనల ప్రతిరూపం.. సర్వేల్ గురుకులం

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని గురుకుల విద్యాలయంతో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు విడదీయరాని అనుబంధం ఉంది. పీవీ నరసింహారావుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆయనతో ఉన్న జ్ఞాకాలను సర్వేల్ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పేదరికంలో మగ్గుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని దారిద్య్రరేఖకు దిగువన ఉన్న పిల్లలకు చక్కటి విద్యాబోధన అందించాలన్నది పీవీ ఆలోచన. ఆయన ఆలోచనలోంచి రూపుదిద్దుకున్నదే సర్వేల్ గ్రామంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయం. 1970లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన పీవీ నరసింహారావు సర్వేల్ గ్రామంలోని సర్వోదయ ఆశ్రమాన్ని సందర్శించారు. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సర్వేల్ గ్రామంలో ఒక విద్యాసంస్థను ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని కోరారు. ఆయన అడిగిందే తడవుగా గ్రామంలో గురుకుల విద్యాలయం ఏర్పాటుకు అనుమతిఇచ్చారు. తన కలను సాకారం చేయడానికి పీవీ వెంటనే ప్రణాళికలు రూపొందించారు. పూర్వపు గురుకులాలను తలపించే రీతిలో ఆధునిక గురుకుల విద్యాలయాన్ని రూపొందించాలనుకున్నారు. దీని నిర్మాణానికి సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి ముందుకొచ్చారు. నారాయణరెడ్డి తన ఆశ్రమానికి చెందిన 40 ఎకరాల భూమిని దానం చేశారు. అంతరం పీవీ నరసింహారావు సీఎం హోదాలో మళ్లీ సర్వేల్ గ్రామాన్ని సందర్శించారు. సర్వోదయ ఆశ్రమంలో ఏర్పాటుచేసిన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయాన్ని 1971 నవంబరు 23 సీఎం హోదాలో పీవీ నరసింహారావు ప్రారంభించారు. ఆనాడు పీవీ సర్వేల్ గ్రామంలో ప్రారంభించిన గురుకుల విద్యాలయం ఎంతో సత్ఫలితాలను ఇచ్చింది. సర్వేల్ గురుకుల విద్యాలయం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం 1972 మార్చి 1న స్వయం పరిపాలన అధికారం గల ప్రత్యేక గురుకుల విద్యాలయ సంస్థను ఏర్పాటుచేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక గురుకుల విద్యాలయాలు ఆవిర్భవించాయి. దీంతో గురుకుల విద్యాలయాలకు రూపకర్తగా పీవీ మారారు. పీవీ ఆలోచనలకు ప్రతిరూపంగా ఆవిర్భవించిన గురుకుల విద్యాలయాలు ఎంతోమంది లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాయి.



మర్రిగూడలో అందుబాటులోకి వైద్యసేవలు

- వైద్యులు లేక మూతబడిన మర్రిగూడ ఆసుపత్రి
- నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతి మినీలో కథనం
- ముగ్గురు వైద్యుల నియమించిన కలెక్టర్
- శుక్రవారం కొనసాగిన వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శుక్రవారం తెరిచిన మర్రిగూడ ఆసుపత్రి

మర్రిగూడ, ఫిబ్రవరి 9 : వైద్యులు లేక మూతబడిన ఆసుపత్రి వైనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మర్రిగూడ ఆసుపత్రి దుస్థితిపై 'డిప్యుటేషన్ల రద్దుతో మర్రిగూడ ఆస్పత్రి ఖాళీ' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. మర్రిగూడ 30 పడకల ఆసుపత్రిలో డిప్యూటేషన్ మీద వచ్చి 12మంది వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ వైద్యులు ఎక్కడి నుంచి వచ్చారో ఆ స్థలాలకు వెళ్లి వెద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మర్రిగూడ ఆసుపత్రిలోని 12 మంది వైద్యులు ఒకేసారి తన స్థానాలకు వెళ్లిపోయారు. దీంతో గురువారం వైద్యసేవలు నిలిచిపోయాయి. ఆసుపత్రిలో నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ హరిచందన స్పందించారు. ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు నిలిచిపోకుండా కొనసాగించాలని ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం ముగ్గురు వైద్యులను నియమించి తిరిగి వైద్యసేవలు అందేలా ఏర్పాటుచేశారు. వైద్యులు లేక మూతపడిన ఆసుపత్రి తలుపులు శుక్రవారం తెరుచుకోవడంతో రోగులు హర్షం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో కే నారాయణరెడ్డి


అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో
సీనియర్స్ పోటీలు ప్రారంభం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ 56వ ఖోఖో సీనియర్ ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో డాక్టర్ కే నారాయణరెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగ రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ సంప్రదాయ క్రీడ అయిన ఖోఖోకు పూర్వ వైభవం వస్తుందన్నారు. క్రమేపీ ఆదరణ పెరుగుతున్నదన్నారు. అంతకుముందు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌తో అతిథులకు గౌరవవందనం చేశారు. పోటీల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీపీ నరాల నిర్మల, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ పాల్గొన్నారు. తొలి రోజు మ్యాచ్‌లను క్రీడాభిమానులు ఉత్సాహంగా తిలకించారు.

20 జట్లు, 48 మ్యాచ్‌లు

భువనగిరిలో మూడు రోజుల పాటు జరుగనున్న తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలకు 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళ, పురుషుల జట్లు, 300 మంది క్రీడాకారులు, 300 కోచ్‌లు, మేనేజర్లు అధికారులు హాజరవుతున్నారు. పగలు, రాత్రి రెండు కోర్టుల్లో 48 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందుకోసం ఫ్లడ్‌లైట్లతో పాటు పూర్తిస్థాయి ఏర్పాట్లుచేశారు. దీంతో భువనగిరిలో క్రీడా సంబురం నెలకొంది. పోటీల్లో ప్రతిభ చూపే 20 మంది మహిళలు, 20 మంది పరుషులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తారు. ఎంపికైన క్రీడాకారులు జూన్‌లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించే జాతీయ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు.

తొలి రోజు 14 మ్యాచ్‌లు



అవుట్ చేసేందుకు యత్నిస్తున్న క్రీడాకారుడు

ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొలి రోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో 8 పురుషుల, 6 మహిళల మ్యాచ్‌లు జరిగాయి. తొలి రోజున అతిథ్య నల్లగొండ జట్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల జట్టు విజయం సాధించగా పురుషల జట్టు తొలి మ్యాచ్‌లో ఓడిపోవడం స్థానిక క్రీడాకారులను నిరాశపర్చింది. అయితే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అభిమానులు క్రీడాస్ఫూర్తిని చాటారు. ఇదిలా ఉండగా ఛాంపియన్ షిప్ పోటీల్లో తొలి రోజు మహిళల విభాగంలో నల్లగొండ జట్టు ఖమ్మంపై 17-5 పాయింట్లతో, హైదరాబాద్ జట్టు ఆదిలాబాద్‌పై 10-5, మహబూబ్‌నగర్ జట్లు నిజామాబాద్‌పై 10-5, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 15-3, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్‌పై 11-4 పాయింట్లతో విజయం సాధించాయి. పురుషుల విభాగంలో ఆదిలాబాద్ జట్టు నల్లగొండపై 13-12, ఖమ్మం జట్టు మెదక్‌పై 13-12, కరీంనగర్ జట్టు మహబూబ్‌నగర్‌పై 13-10, వరంగల్ జట్టు నిజామాబాద్‌పై 15-10, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 12-10, హైదరాబాద్ జట్టు నల్లగొండపై 13-11, కరీంనగర్ జట్టు ఖమ్మంపై 10-8, ఆదిలాబాద్ జట్టు వరంగల్‌పై 15-4 పాయింట్లతో గెలుపొందాయి.


హమ్మ బాబోయ్ దొంగలు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 9 : తీగ లాగితే డొంక కదిలింది. ట్యాబ్ తస్కరిస్తున్న మహిళను పోలీసులు పట్టుకుని విచారించగా 10 మంది సభ్యులున్న దొంగల ముఠా గుట్టు రట్టయ్యింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంద్యాల జిల్లా డోన్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరంతా హైదరాబాద్ సమీపంలోని బొంగులూరు వద్ద ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటూ వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, రద్దీ ప్రదేశాల్లో దొంగతనాలకు చేస్తుంటారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ మహిళ వద్ద నుంచి ట్యాబ్‌ను చోరీ చేస్తున్న మహిళను స్థానికులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మహిళను తమదైన శైలిలో విచారించగా 10 మందితో కూడిన దొంగల ముఠా పట్టుబడింది. వీరితో పాటు నలుగురు నేరస్తులు పట్టుబడ్డారు. వీరి నుంచి కారు, 10 సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ వీరబాబు, సిబ్బంది హేమనాయక్, వెంకటేశ్, భాస్కర్, గురువారెడ్డి, లక్ష్మణ్‌లను ఆయన అభినందించారు.

కొట్టేసిన బైక్‌జీపీఎస్ లొకేషన్‌తో పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 9 : జల్సాల కోసం చోరీలు చేస్తున్న ఇద్దరు యువకులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ నర్సింహారావు కేసు వివరాలను వెల్లడించారు. గతంలో కారుడ్రైవర్‌గా పనిచేసిన కనగల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షి శ్రీను అలియాస్ నల్లగొండ శ్రీను తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు చేయడం ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఇతడిపై హైదరాబాద్, నల్లగొండ జిల్లాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో 40 చోరీ కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఓ చోరీ కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి ఈ నెల 1వ తేదీన బయటకువచ్చాడు. చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా పొద్దుటూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అలమూరి సంజీవరెడ్డితో పరిచయం ఏర్పడింది. ఇతను కొంతకాలం ఓ కంపెనీలో టెలీకాలర్‌గా పనిచేస్తూ ఓ కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో చోరీలు చేసేందుకు సిద్ధపడ్డారు. అందులో భాగంగా ఈ నెల 6న రాత్రి మిర్యాలగూడ వచ్చిన నిందితులిద్దరూ స్థానిక అశోక్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలతో పాటు నగదును చోరీ చేశారని సీఐ తెలిపారు. అదేవిధంగా ఇదే కాలనీలోని ఓ ఇంటిముందు పార్క్‌చేసిన టీఎస్05ఎఫ్‌కే 5597 నెంబర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్‌కు జీపీఎస్ లొకేషన్ ఉండడంతో దాని ఆధారంగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ఏరియాలో సంచరిస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా తాము చేసిన నేరాలను అంగీకరించడంతో ఇరువురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. కాజేసిన సొత్తును విక్రయించి మద్యం, సిగరేట్ ఇతర వ్యసనాలు తీర్చుకునేందుకు వచ్చే డబ్బును నిందితులు ఖర్చుచేసేవారని సీఐ తెలిపారు. కాగా దొంగలను చాకచక్యంగా పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్‌ఐలు కృష్ణయ్య, రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, అనిల్,నరేష్, రామకృష్ణలను సీఐ అభినందించారు.

యువకుల ఛేజింగ్.. దొంగల పరార్



దొంగలు పరారైందీ ఈ కారులోనే

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో అనుమానాస్పదంగా కారులో తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించిన గ్రామ యువకులపై దాడి చేసి సినీ ఫక్కీలో పరారయ్యారు గుర్తు తెలియని వ్యక్తులు. వీరిని దొంగలుగా అనుమానిస్తున్నారు. కారులో పరారవుతుండగా వెనక యువకులు వెంబడించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. జైకేసారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వారం రోజుల క్రితం కారులో వచ్చిన దొంగలు 10 మేకలను అపహరించారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ కారులో ఇద్దరు యువకులు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని యువకులు అడ్డుకుని ప్రశ్నించబోయారు. దీంతో వారు యువకులపై దాడి చేసి కారులో చౌటుప్పల్ వైపు పరారయ్యారు. కానీ యువకులు ధైర్యంతో కారును ఛేజింగ్ చేస్తూ వీడియో తీశారు. దొంగలు కారును చౌటుప్పల్ వద్ద వలిగొండ రోడ్డులోని బాలాజీ వెంచర్‌లోకి అతివేగంతో తీసుకెళ్లారు. ఆ ప్రాంత యువకులు అడ్డుకోవడానికి యత్నించినా ఆపకుండా సినీఫక్కీలో గల్లి గల్లి తిప్పుతూ అతివేగంతో హైవే మీదుకు దూసుకెళ్లారు. ఈ సంఘటనపై మాజీ సర్పంచ్ సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు వనస్థలిపురం ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి చెందాడు. ఏఎస్‌ఐ జానీ తెలిపిన వివరాలప్రకారం వెల్లటూరు గ్రామానికి చెందిన సీసం వెంకటేశ్వర్లు(36) కల్లు గీత వృత్తిని నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో మండల కేంద్రంలో వృత్తి పని ముగించుకుని స్వగ్రామం వెల్లటూరు వెళ్తుండగా రాఘవపురం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో హుజూర్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని జానీ తెలిపారు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు పిల్లలు కాగా భార్య వెంకటరావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మా పరిస్థితి ఏమిటి?

● ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ● తెల్ల కాగితాలపై దరఖాస్తులు చేసుకున్న వాటికి మోక్షం కరువు
●అర్జీలు పెట్టుకున్న లబ్ధిదారుల ఎదురుచూపులు ● ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయడానికి గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి ఆరో తేదీ వరకు ప్రజాపాలన పేరుతో కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆరు గ్యారెంటీల పథకాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫారంలో ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. అదే సమయంలో రేషన్ కార్డులు లేని లబ్ధిదారులు, నూతన రేషన్ కార్డుల కోసం, భూ సమస్యలను పరిష్కారం కోసం తెల్ల కాగితాలపై దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తులనే అధికారులు ఆన్‌లైన్ చేశారు. తెల్లకాగితాల దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయలేదు. దీంతో తెల్లకాగితంపై దరఖాస్తుల చేసిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మహాలక్ష్మీ పథకం క్రింద ప్రతి నెలా రూ.2,500 లు, మహిళలకు రూ.500కే వంట గ్యాస్‌ను అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ రెండు పథకాలకు అర్హులుకావాలంటే రేషన్ కార్డును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. తెల్లకాగితంపై రేషన్ కార్డుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ అర్జీలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందా? లేదా అనే సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. అధికారులు మాత్రం ఆరు గ్యారెంటీలకు ప్రజలు ఇచ్చిన దరఖాస్తులనే ఆన్‌లైన్ చేశారు.

అర్జీలు పెట్టుకున్న ప్రజల ఎదురుచూపులు

నూతన రేషన్ కార్డులు, ధరణి భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా పాలన కార్యక్రమంలో తెల్లకాగితంపై వేలమంది దరఖాస్తు చేసుకు న్నారు. జిల్లా వ్యాప్తంగా 475గ్రామ పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీల్లో ఆరు గ్యారెంటీలకు మొత్తం 3,62,203దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు తెల్లకాగితాలసౌ 60,610 దరఖాస్తులు వచ్చాయి. అయితే అధికారులు నిర్దీత నమూనాలో వచ్చిన 3,62,203 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. తెల్లకాగితాలపై వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా ఫైల్ చేసి ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

తెల్లకాగితంపై దరఖాస్తులు చేసుకున్నవారు మండలాల వారీగా..

అనంతగిరి1,335, ఆత్మకూర్(ఎస్)3,549, చిలుకూరు2,806, చింతలపాలెం 1,829, చివ్వెంల2,303, గరిడేపల్లి3,102, హుజూర్‌నగర్1,989, జాజిరెడ్డిగూడెం 2,429, కోదాడ2,820, మద్దిరాల2,125, మఠంపల్లి1,978, మేళ్లచెర్వు1,882, మోతె3,021, మునగాల2,954, నడిగూడెం2,230, నాగారం2,136, నేరేడుచర్ల 2,244, నూతన్‌కల్3,050, పాలకవీడు1,206, పెన్‌పహాడ్2,047, సూర్యాపేట రూరల్2,549, తిరుమలగిరి1,769,తుంగతుర్తి 2,864, హుజూర్‌నగర్ మునిసిపాలిటీ667, కోదాడ మునిసిపాలిటీ23, సూర్యాపేట మునిసిపాలిటీ3,123, నేరేడుచర్ల మునిసిపాలిటీ836, తిరుమలగిరి మునిసిపాలిటీ 1,744మంది ఉన్నారు. ఇలా మొత్తం 60,610మంది దరఖాస్తు చేసుకున్నారు.



ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేస్తున్న మహిళలు (ఫైల్ ఫొటో)

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వం పథకాలతో పాటుగా కొంతమంది నూతన రేషన్ కార్డులు, భూ సమస్యలను పరిష్కారించాలంటూ తెల్లకాగితం పై సమస్యను రాసి దరఖాస్తు చేశారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేయడం పూర్తిచేశాం. తెల్లకాగితాల దరఖాస్తులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కాగితాలపై వచ్చిన దరఖాస్తులను ఫైల్ చేసి భద్రపర్చాం

● యాదయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారి

క్రీడాకారుడికి రూ.40వేల ఆర్థికసాయం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: దుబాయ్‌లో నిర్వహించనున్న క్రికెట్ పోటీలకు ఎంపికైన మఠంపల్లి మండలం బీల్యానాయక్ తండాకు చెందిన బాణోత్ సతీష్‌నాయక్‌కు హుజూర్‌నగర్‌కు చెందిన తిరుమల-తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి శుక్రవారం రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. క్రికెట్ కిట్ కొనుగోలు చేసుకునేందుకు ఈ నిధులు అందజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంబటి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌రావు, నట్టె సత్యనారాయణ,శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తమ్మినేనికి సీపీఎం నాయకుల ఘన స్వాగతం

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 9: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తూ సూర్యాపేట సమీపంలోని ఓ హోటల్‌లో ఆగారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది తొలిసారి జిల్లాకు రావడంతో సూర్యాపేట సీపీఎం నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వీరభద్రాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సన్మానించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.స్వాగతం పలికినవారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, మేకనబోయిన శేఖర్, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, సైదమ్మ, రవి తదితరులు ఉన్నారు.

31 గ్రామ పంచాయతీలకు 'ఉపాధి' నిధులు

చివ్వెంల, ఫిబ్రవరి 9: మండలంలోని 31గ్రామ పంచాయతీలకు 'ఉపాధి' నిధులు రూ.1.75కోట్లు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో జరుగుతున్న మొదటి అభివృద్ధి పనులు కావడంతో అట్టహాసంగా ప్రారంభించడానికి కాంగ్రెస్ నాయకులు సన్నద్ధమయ్యారు. చివ్వెంలకు రూ.10 లక్షలు, సూర్యానాయక్‌తండాకు రూ.15లక్షలు, బండమీది చందుపట్లకు రూ.10లక్షలు, మిగిలిన గ్రామాలు, తండాలకు రూ.5లక్షల చొప్పున కేటాయించారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించనున్నారు. ఈ పనులకు ఈనెల చివరి వారం లోపు పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

'మైహోం' సేవలు అభినందనీయం

మఠంపల్లి, ఫిబ్రవరి 9: పశుసంరక్షణలో 'మైహోం' పరిశ్రమ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డి.శ్రీనివాస్‌రావు అన్నారు. మైహోం పరిశ్రమ సౌజన్యంతో మండల పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని పరిశ్రమ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎన్.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 160పశువులు, 3010 గొర్రెలు, మేకలు, కుక్కలు, కోళ్లకు చికిత్స చేసి రూ.4లక్షల విలువైన మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి శంకర్ కట్టా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాల అడిషనల్ డైరెక్టర్ రూప్‌కుమార్, అనిల్, ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ సైదారాణి, చౌటపల్లి మాజీ సర్పంచ్ కృష్ణవేణినరేష్, మైహోం పరిశ్రమ జనరల్ మేనేజర్ నాగేశ్వరావు, సలహాదారుడు జగన్నాథరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి పున్నంరాజు

మఠంపల్లి, ఫిబ్రవరి 9: పేదల ఆశాజ్యోతి కోలాహలం పున్నంరాజు అని యాతవాకిళ్ల గ్రామ మాజీ సర్పంచులు కోలహలం లక్ష్మీనరసింహరాజు, కోలహలం కృష్ణంరాజు అన్నారు. సీపీఎం నాయకుడు పున్నంరాజు 36వ వర్ధంతి సందర్భంగా మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో ఆయన స్థూపానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సీతయ్య, పల్లె వెంకటరెడ్డి యల్లావుల నాగయ్యయాదవ్, సైదులు, వెంకన్న, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పున్నంరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భూక్య పాండునాయక్, శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మాలోతు బాలునాయక్, సయ్యద్ రన్‌మియా, వెంకన్న, చిన్నబాలునాయక్, శంభయ్య, సమన్, మల్లేశ్వరి, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో పున్నంరాజు చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి పి.హుస్సేన్‌ముదిరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడిన గొప్ప నాయకుడు పున్నంరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు వెంకటచంద్ర, గోపరాజు, గోపాల్‌రావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతా బాబు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 9: తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదాడకు చెందిన చింతా బాబును నియమించారు. శుక్రవారం హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చింతా బాబుకు నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అందజేశారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోదాడ డీఎస్పీ ప్రకాష్

కోదాడ టౌన్, ఫిబ్రవరి 9: రోడ్డు నియమనిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహనఉంటేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని కోదాడ డీఎస్పీ ప్రకాష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాబు అన్నారు. జాతీయ 35వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోదాడలోని లారీ యజమానుల అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. 80శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడపడం, మద్యం తాగి అతివేగంతో నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించామన్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై లారీ యజమానులకు, డ్రైవర్లక్షు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటించాలి అంటూ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో పట్టణ సీఐ రాము, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, కోదాడ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ రామినేని శ్రీనివాసరావు, తూనం కృష్ణ, యలమందుల నరసయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, గుండపునేని నాగేశ్వరరావు, విలాస కవి నరసరాజు, ఆలేటి రాంబాబు, పెద్ది అంజయ్య, రఫి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలి

అర్వపల్లి, నాగారం, ఫిబ్రవరి 9: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో, నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. దేశంలో సుస్థిర ప్రభుత్వాన్ని నడిపిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో 10ఎంపీ స్థానాలను బీజేపీ గెలుస్తుందన్నారు. బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్యతో కలిసి ఫణిగిరిగుట్ట కోవెల వద్ద సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎస్సీ కాలనీలో గుర్కుజీ ఇంటిలో బీజేపీ కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాప రవి, బ్రహ్మచారి, ఎం.చిరంజీవి పాల్గొన్నారు.

తుంగతుర్తి: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనన గెలిపించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. మండల కేంద్రంలో 'గ్రామం చలో..బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా తుంగుతర్తిలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంకినేని రవీందర్‌రావు, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, ఉప్పుల లింగయ్య, పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెం గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

పెన్‌పహాడ్: బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని నల్లగొండ పార్లమెంటు కోకన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి అన్నారు. మండలంలోని అన్నారంబ్రిడ్జి, నాగులపాటి అన్నారం గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీజేపీ కార్యకర్తలతో కలిసి సీతారామాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేయించారు. కార్యక్రమంలో రాములు, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఫణినాయుడు, గణేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి'

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 9: రైతులు, అసంఘటిత కార్మికులు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 16వ తేదీన నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన గ్రామీణ భారత్‌బంద్ సంఘీభావ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దూళిపాళ ధనుంజయనాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలో జరిగిన కార్మికుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా మాట్లాడుతూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురవయ్య, నవీన్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు కోరారు. నూతనకల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డేవిడ్ కుమార్, పోటు లక్ష్మయ్య, కామల్ల నవీన్, గంట నాగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

భానుపురి, ఫిబ్రవరి 9: సూర్యాపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేయాలని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేనందున విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక విద్యకు దూరమయ్యారన్నారు. జిల్లాలో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో, మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపకారవేతనాలు విద్యార్థుల ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో శ్యాం, లింగంపల్లి సుధాకర్, మల్లేష్, రవి, మధు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత కవితకు లేదు'

కోదాడ, ఫిబ్రవరి 9: లిక్కర్ స్కాంలో ఉన్న ఎమ్మెల్సీ కవితకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదని డీసీసీబీ మాజీ ఛైర్మన్ ముత్తవరపు పాండురంగారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్, హరీష్‌రావు అనేక కుంభకోణాల్లో ఉన్న విషయాన్ని కవిత మరిచి కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీలు చేసి, నిరుద్యోగులను రోడ్డుపాలు చేయటంతో పాటు ఆత్మహత్యలు చేసుకునే విధంగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన విమర్శించారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరుచేయాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: బూరుగడ్డ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌ను కలిసి బూరుగడ గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని, మాచవరంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, సీసీ రోడ్లకు నిధులు మంజూరుచేయాలని కోరారు. బూరుగడ్డ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారని అరుణ్‌కుమార్ తెలిపారు.

రామాలయంలో నేటి నుంచి ఉత్సవాలు

మఠంపల్లి, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ఆవరణలో ఉన్న సీతారామాలయం 11వ వార్షికోత్సవాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం 7.30గంటల నుంచి పూజలు ప్రారంభవుతాయని, 13వ తేదీన సుదర్శన హోమంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజాస్వామ్యం గెలిచింది: సీపీఎం

మునగాల, ఫిబ్రవరి 9: ప్రజాస్వామం గెలిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుర్రి శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునగాల జడ్పీటీసీ ఎన్నిక చెల్లదని హుజూర్‌నగర్ సివిల్ కోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన నల్లపాటి ప్రమీల తన నామినేషన్‌లో తన ఇద్దరు పిల్లలున్నారని నమోదు చేశారన్నారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ బలపరిచిన సీపీఎం అభ్యర్థి దేశిరెడ్డి జ్యోతి ఓడిపోయారన్నారు. ప్రమీలకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఈ ఎన్నికల చెల్లందటూ 2019, జూలైలో కోర్టును జ్యోతి ఆశ్రయించారన్నారు. అప్పటినుంచి కేసు కొనసాగగా, ప్రమీల ఎన్నికను రద్దు చేస్తూ, జడ్పీటీసీగా దేశిరెడ్డి జ్యోతిని నియమించాలని కోర్టు ఈ నెల 5వ తేదీన తీర్పు ఇచ్చిందన్నారు. జిల్లా అధికారులకు కోర్టు తీర్పు పత్రాలు అందిన వెంటనే దేశిరెడ్డి జ్యోతి జడ్పీటీసీగా కొనసాగుతారన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, స్వరాజ్యం, వెంకట్‌రెడ్డి, జూలకంటి విజయలక్ష్మి, గంధం జానకమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాధవరాయనిగూడెంను పరిశీలించి మాట్లాడారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వతో మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా, మెదడువాపు, బోధకాలు లాంటి వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ వాణి,పద్మ, ఇందిరాల రామకృష్ణ, మాధవి, లిఖిత్, గంగరాజు పాల్గొన్నారు.

చిలుకూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో యాదయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి షర్ఫుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య, సిబ్బంది ఉన్నారు

అర్వపల్లి: దోమల నివారణ కోసం పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సుయాదవ్ అన్నారు. మండలంలోని అడివెంల గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి, పెరుమాళ్ల పద్మవెంకటయ్య, గంగ, సిగబోయిన వెంకన్న, రవి, ప్రవీణ్, మేడబోయిన బిక్షం పాల్గొన్నారు.

మద్దిరాల: గ్రామాల్లో మురుగు కాల్వల్లో పూడిక తీయాలనిజడ్పీటీసీ కన్న సురాంబవీరన్న అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తరుణ్, పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: అంగన్‌వాడీ ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన అంగన్‌వాడీఆయాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఆయాలు 2006 సంవత్సరం నుంచి రూ.7800వేతనానికే పనిచేస్తున్నారని, కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంతెనపల్లి సుజాత, జ్యోతి, సావిత్రి పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ అన్నారు. పీఆర్‌టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈ సందర్భంగా బందు కృష్ణయ్య, చీకూరి జగన్‌మోహన్, మెంచు వెంకన్న, మండడి వీరారెడ్డి, కోమిరెల్లిని సన్మానించారు. కార్యక్రమంలో చింతరెడ్డి రామలింగారెడ్డి, జితేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సూర్యాపేట సిటీ: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీఐటీయూ పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది టీఆర్ఎస్‌కేవి సంఘానికి రాజీనామా చేసి సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సుజాత, అనిత, శశిరేఖ పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: మండలంలోని సోలిపేట ప్రభుత్వ పాఠశాలకు గ్రామ ఉప సర్పంచ్ నర్ర సుగుణమ్మ భర్త రాములు జ్ఞాపకార్థం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపేందర్, ఉప్పలయ్య, నిర్మల, రాణి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: చెరువులు నింపకుండా కొందరు అడ్డుకోవడం సరి కాదని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, గీతకార్మిక సంఘం అధ్యక్షుడు వల్లబుదాసు కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడుతూ విలేకరులతో చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలించేందుకే నీటితో నింపకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు చెరువులను వెంటనే నింపాలన్నారు.

● తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎన్నికైన హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పల్లె నాగేశ్వరరావును ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్‌ను హైదరాబాద్‌లోని హైకోర్టులో కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తొగర్రాయి గ్రామానికి చెందిన పల్లె నాగేశ్వరరావు అంచెలంచెలుగా ఎదుగుతూ అణగారిన వర్గాలకు అండగా ఉన్నారన్నారు. పల్లె ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, షరీఫ్, రాజన్న, గురవయ్య పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో గల శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు పసుపు, కుంకుమ, పూలతో పూజలు చేశారు. కార్యక్రమంలో యరగాని రామస్వామి, మల్లమ్మ, కిరణ్‌గౌడ్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేరేడుచర్ల: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బూర్గుల తండాలో ఉన్న సోమప్ప దేవాలయంలో పులిహోర, లడ్డు ప్రసాదాలు, కొబ్బరికాయల విక్రయానికి ఈనెల 16న బహిరంగ వేలం నిర్వహిస్తాని మేనేజర్ కొంకపాక మృత్యుంజయశాస్త్రి తెలిపారు. మార్చి 8వ తేదీన మహాశివరాత్రి పురస్కరించుకుని మార్చి 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రసాదాలు, కొబ్బరికాయలు విక్రయించుకోవచ్చ న్నారు. కొబ్బరికాయల విక్రయానికి రూ. 5వేలు, లడ్డు, పులిహోర విక్రయానికి రూ.5 వేలు, సైకిల్‌స్టాండ్ వేలానికి రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

● నేరేడుచర్ల మండలం బూర్గులతండాలో ఉన్న సోమప్ప దేవాలయం ధర్మకర్తల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఆలయ మేనేజర్ మృత్యుంజయశాస్త్రి తెలిపారు. సోమప్ప దేవాలయం ఛైర్మన్‌గా ఉన్న రాచకొండ శ్రీను రాజీనామా చేయడంతో నూతన ధర్మకర్త మండలిని నియమిస్తున్నట్లు తెలిపారు.

● ఆర్య వైశ్య మహాసభ పట్టణ మహిళా అధ్యక్షురాలు కందిబండ వాసంతి, హరిప్రసాద్ దంపతులు తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు చాకెట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ కోశాధికారి గరిణె రాధిక, వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ కొత్త లక్ష్మణ్, రాచకొండ శ్రీను మహాలక్ష్మి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని శంభులింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో కొండారెడ్డి తెలిపారు.

గరిడేపల్లి: పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఆ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పనితి ఎల్లయ్య కోరారు. మండలంలోని కీతవారిగూడెం ఉన్నత పాఠశాలలో టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సువర్ణ, రాష్ట్ర కార్యదర్శి ఓ రుగంటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పాలూరు అంజయ్య, మండల కార్యదర్శి భూక్యా రమేష్, సత్తారి బిక్షం, పిట్ట వీరస్వామి, పెండెం వీరస్వామి మంగమ్మ నర్సిరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి మండలంలోని కాల్వపల్లి ప్రాథమిక పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా రాయినిగూడెం బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్ రూ.5వేల విలువైన ఐరన్ ర్యాక్, విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రత్తయ్య, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఎన్.ఉదయ్‌కుమార్, సాయికుమార్, పాల్గొన్నారు.

కోదాడ: పట్టణానికి చెందిన ఆకుల వెంకన్నలక్ష్మి కుమారుడు ఆపరేషన్ నిమిత్తం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఆ క్లబ్ అధ్యక్షుడు వంగవీటి నాగరాజు రూ.30,617ను అందజేశారు.ఈ కార్యక్రమంలో చిత్తలూరి బాస్కర్‌రావు, వెంపటి ప్రసాద్, చల్లా లక్ష్మీనరసయ్య, చల్లా విజయ్‌శేఖర్, జగిని ప్రసాద్, లోకేశ్వరరావు, సతీష్‌బాబు పాల్గొన్నారు.

చిలుకూరు, కోదాడ, కోదాడ రూరల్ గృహజ్యోతి పథకం కోసం ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులను సరిదిద్దుకోవాలని అధికారులు కోరారు. చిలుకూరు మండలంలో గ్యాస్ సబ్సిడీ దరఖాస్తులను తనిఖీ చేస్తున్న బృందాలను కోదాడ నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. గ్యాస్ నెంబర్లు తప్పుగా నమోదు చేసిన వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సరిచేస్తున్నామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఈదయ్య, గ్రామ ప్రత్యేకాధికారులు ఉన్నారు. కోదాడ మండలంలో 6274రేషన్‌కార్డు దరఖాస్తులు తమ గ్యాస్ వినియోగ నెంబరును తప్పుగా నమోదు చేశారని, వీటిని ఆన్‌లైన్‌లో సరిచేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి దయానందరాణి తెలిపారు.

తిరుమలగిరి: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మద్యాన్ని విక్రయించొద్దని ఎస్ఐ సత్యనారాయణ కోరారు. తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంతో పాటు మండలంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు.

తిరుమలగిరి రూరల్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ మండల కన్వీనర్ నీరటి నవీన్ అన్నారు. మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, కృష్ణమూర్తి, సోమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: నల్గొండ జిల్లా కేంద్రంలో ఈనెల 13న నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. తిరుమలగిరిలో మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ సమావేశంలో పార్టీ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, జడ్పీటీసీ అంజలి, తెడ్డు భాస్కర్ పాల్గొన్నారు.

అర్వపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని తిమ్మాపురం మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రత్నం లక్ష్మాజీ, పాలెల్లి సురేష్, కర్ణాకర్‌రెడ్డి, రత్నం సంతోష్ పాల్గొన్నారు.

అర్వపల్లి: ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ సురేష్ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇందుర్తి వెంకట్‌రెడ్డి, రత్నం లక్ష్మాజీ, వేములకొండ ఉప్పలయ్య, ఈదునూరు సంతోష్, రత్నం సంతోష్, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తుంగతుర్తి ఎస్ఐ ఏడుకొండలు అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై మండలంలోని రావులపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల సరఫరా, ఉత్పత్తి చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదుచేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

నూతన్‌కల్: మండలంలోని వెంకేపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు అధికారులను కోరారు. మండలంలోని వెంకేపల్లి గ్రామంలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మట్టిపల్లి సైదులు, జానయ్య, కందాళ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.